క్లుప్తంగా

నేడు పట్టణంలో విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలో మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ 2 ఏఈ ఆదిత్య, టౌన్ 3 ఏఈ భగవంతయ్య వేరు వేరు ప్రకటనల్లో సోమవారం పేర్కొన్నారు. జెడ్పీ ఇండోర్ 33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా న్యూటౌన్, శెట్టికాం ప్లెక్స్, డీఈఓ ఆఫీస్, బోయపల్లిగేట్, పోలీస్ లైన్, నోబుల్ ఆస్పత్రి, రవి చిన్న పిల్లల ఆస్పత్రి, తెలంగాణ చౌరస్తా, కొత్త బస్టాండ్, కలెక్టర్ బంగ్లా చౌరస్తా, ఓపెన్ వాల్వ్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల దాక సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. అదేవిధంగా స్టేడియం గ్రౌండ్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ కారణంగా ..స్టేడియం, క్రౌన్ ఫంక్షన్‌హాల్, వాసవీకాలేజ్, రామాలయం, వాగ్దేవి కాలేజ్, షాషాబ్‌గుట్ట, న్యూటౌన్, మలబార్ గోల్డ్ వెనుక ప్రాంతాలల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటలదాక విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

గ్రౌండ్ ఏర్పాటుకు సాయం

బాలానగర్: ఈదమ్మ గడ్డ తండాలో వాలీబాల్ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకునేందుకు నేరళ్లపల్లి ఎంపీటీసీ లింగునాయక్ రూ. 20వేల ఆర్థికసాయం సోమవారం క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా పోటీల్లో చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. జగత్ ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశలింగం సేవలు స్ఫూర్తిదాయకం

జడ్చర్ల టౌన్: కందుకూరి వీరేశలింగం వర్ధంతి సోమవారం సంస్కారభారతి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సభ్యుడు గోనెల రాధాకృష్ణ, ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

వీరప్పయ్యస్వామికి ప్రత్యేక పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దేవరకద్రకు చెందిన గడ్డమీది బాలరాజు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక భద్రతాచర్యలు తీసుకోవాలి

నవాబుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆస్పత్రిలో మహిళా సిబ్బంది ఎక్కువగా ఉన్నారని, రాత్రి విధులు నిర్వహిస్తారని.. ఈ నేపథ్యంలో ఆస్పత్రి పరిసరాల్లో ప్రత్యేక భద్రతా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి నవీన్‌చంద్ర అన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డిని కలిసి విషయంపై వివరించారు. తాజాగా మహిళల మెడల్లో నుంచి బంగారు ఆభరణాలు చోరీ అవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని.. ఈ క్రమంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాగా ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళలు కొత్త వ్యక్తుల ఆటోల్లో ప్రయాణం చేయకూడదని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

రమాబాయికి నివాళి



జడ్చర్ల టౌన్: అంబేద్కర్ ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో రమాబాయి సహకారం ఎంతో ఉందని నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని అంజనాద్రినగర్ ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రమాబాయి వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. సొసైటీ అధ్యక్షురాలు బాలమణి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక



నారాయణపేట రూరల్: పట్టణానికి చెందిన హరిప్రియ గత విద్యా సంవత్సరంలో పీహెచ్ ఈఎస్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ స్థానిక ఎస్ఎస్ఆర్ కోచింగ్ సెంటర్‌లో ఎన్ఎంఎంఎస్‌కు శిక్షణ పొందింది. ఈ క్రమంలో పరీక్షలో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కోచింగ్ సెంటర్‌లో డైరెక్టర్ శేఖర్‌తోపాటు బోధకులు, విద్యార్థులు ఆమెకు మిఠాయిలు తినిపించి అభినందించారు. కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాన్ని అయిన సాధించవచ్చన్నారు.

వెలవెలబోతున్న దుకాణాలు

- వ్యాపార నిర్వహణకు అడ్డంకిగా మారిన రోడ్డు విస్తరణ
- నత్తనడకన పనులు సాగుతుండడంతో వ్యాపారుల్లో ఆందోళన
- అద్దె భారం మోయలేక షాపులను మూసివేస్తున్న వైనం



రోడ్డుపై రాకపోకలు నిలిపివేయటంతో గిరాకీ లేక వెలవెలబోతున్న దుకాణాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డపై 167వ నంబరు జాతీయరహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రోడ్డు విస్తరణ పనుల కారణంగా వ్యాపారాలు సక్రమంగా నడవక కొన్ని మూతబడుతుండగా మరికొన్ని తీరని నష్టాల్లో కూరుకుపోతున్నాయి. రాయచూర్–కోదాడ మార్గంలో 167వ నెంబరు రోడ్డు విస్తరణ పనులు 750మీటర్ల మేర ఆలస్యంగా ప్రారంభం అయ్యాయి. సిగ్నల్‌గడ్డ ఎల్‌ఐసీ కార్యాలయం మొదలుకుని డిగ్రీకళాశాల హాస్టల్ వరకు పనులు ప్రారంభం అయ్యాయి. అయితే రోడ్డు ఒకవైపు పనులు పూర్తిచేసి మరోవైపు మొదలు పెట్టాల్సి ఉండగా రెండు వైపులా ఒకేసారి ప్రారంభించటంతో సమస్యలు మొదలయ్యాయి. ఎల్‌ఐసీ కార్యాలయం వైపు ఒకవైపు పూర్తిగారాకపోకలు నిలిపివేశారు. ఈకారణంగా ఆ మార్గంలో ఉన్న వ్యాపారాలు



రోడ్డుపై రాకపోకలు నిలిపివేసి అడ్డుగా ఉంచిన యంత్రాలు

పూర్తిగా దివాళా తీస్తున్నాయి. 6 నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. టిఫిన్‌సెంటర్లు, టీదుకాణాలు మూతబడ్డాయి. మరికొన్ని దుకాణాల పరిస్థితి అదే విధంగా తయారైంది. వాహనాల రాకపోకలు లేక పోవటంతో వ్యాపారాలు లేక వెలవెలబోతున్నాయి. ఇదే మార్గంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఉండగా.. రోడ్డు పనుల కారణంగా ఆస్పత్రికి అత్యవసరపరిస్థితుల్లో అంబులెన్స్ సైతం రాకుండా ఉంది. రెండోవైపు రాకపోకలు ఉన్నప్పటికీ ట్రాఫిక్ సమస్య కారణంగా దుకాణాల ముందు ఎవరు నిలవటం లేదు. దీంతో తెరిచిన దుకాణాలు నడవటం లేదు. ఇక డిగ్రీకళాశాల వైపు అదే పరిస్థితి నెలకొంది.



డిగ్రీకళాశాల వద్ద ఒకవైపు రాకపోకలు నిలిపివేస్తూ.. వేసిన కంకర కుప్పలు

అయితే ప్రస్తుతం ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేసిన ప్రాంతంలో కొన్ని దుకాణాలు ఉండటం ఒకింత ఉపశమనం కలిగిస్తుంది. మరోవైపు కొనసాగిస్తున్నా ఆ మార్గంలోనూ ఇవే సమస్యలు నెలకొన్నాయి. వేలల్లో అద్దెలు చెల్లించాల్సి రావటం, సిబ్బందికి జీతాలు, కరెంట్ బిల్లులు ఇలా దుకాణాదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు ఇలాగే ఉంటే తమ బతుకులు రోడ్డున పడటం ఖాయమంటున్నారు. ఒక్కో దుకాణంలో రూ.5లక్షల నుంచి 10లక్షల వరకు నష్ట పోతున్నామని వాపోతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు..

రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని పట్టణవాసులు ఇటీవల జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోడ్డు పనుల కారణంగా తనకు ప్రమాదం జరిగి కాలికి దెబ్బతగిలిందని ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. అతడికి తోడుగా రోడ్డుపనులు కొనసాగుతున్న ప్రాంత వ్యాపారులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

నాలుగునెలలుగా ఇబ్బంది పడుతున్నాం..



రూ. వేలల్లో అద్దెకు తీసుకుని టిఫిన్‌సెంటర్ నిర్వహిస్తున్నాం. రాకపోకలు ఉన్నన్ని రోజులు నాతోపాటు నలుగురికి ఉపాధి లభించింది. ఇప్పుడైతే నాలుగు నెలల నుంచి రోడ్డుపై రాకపోకలు నిలిపివేయటంతో పరిస్థితి చాలా కష్టంగా మారింది. అద్దెతోపాటు నిర్వహణభారం పడుతోంది. రోడ్డుపై రాకపోకలు లేకపోవటంతో ఇటుగా రావటానికి ఎవరు ఇష్టపడటం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే బతుకులు పూర్తిగా రోడ్డున పడతాయి.

జయరాజ్, టిఫిన్‌సెంటర్ నిర్వాహకుడు, బాదేపల్లి.

నిర్వహణ భారంగా మారింది..



రోడ్డు పనుల కారణంగా ఒకవైపు నుంచి వాహనాలు వెళ్లి వస్తుండటంతో పార్కింగ్ చేసుకునే సదుపాయం లేకుండా పోయింది. ఈకారణంగా ఆరు నెలలుగా పూర్తిగా గిరాకులు దెబ్బతిన్నాయి. నాలుగు నెలల నుంచి అద్దెతోపాటు నిర్వహణ భారంగా మారింది. రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఇంకెంత కాలం ఇలా ఉంటుందో తెలియటం లేదు.

– విశ్వం, హార్డ్‌వేర్, ఫ్లెక్సీడిసెంటర్ నిర్వాహకుడు, బాదేపల్లి.

ఇలా అయితే బతుకులు రోడ్డుమీదకే..



రోడ్డు పనులు ఇంకెన్నాళ్లు కొనసాగుతాయో తెలియకుండా ఉంది. ఇలా అయితే మా బతుకులు రోడ్డున పడ్డట్లే. ఆరునెలల నుంచి ఎప్పుడు రాకపోకలు నిలిపివేస్తారో తెలియడం లేదు. సాంకేతికంగా, యంత్రాల పరంగా ఎంతో అభివృద్ధి చెందిన సమయంలో నెలల తరబడి రోడ్లు వేయకుండా ఉండటం నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఒకవైపు రోడ్డు వేయటానికే ఇన్నేళ్లు పడితే ఇక మా వైపు ఇంకెన్నాళ్లు దుకాణాలు మూసుకోవాలో... త్వరగా రోడ్డు పనులు పూర్తిచేసి మమ్మల్ని ఆదుకోవాలి.

– కిశోర్‌రెడ్డి, కిడ్స్‌వేర్ నిర్వాహకుడు, బాదేపల్లి.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు

భూత్పూర్: మండలంలోని కర్వెన ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల (2002 – 2004) ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బి.యాదగిరి, డి.మల్లికార్జున్, లింగం, శ్రీనివాస్, జి.వెంకటేష్, అలివేలును కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, వృత్తి, వ్యాపారాలను గురించి చెప్పుకొన్నారు.

సకాలంలో అందేనా..?



మండలకేంద్రంలోని కేజీబీవీలో డంప్ చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు

- మండలానికి 60 శాతం పుస్తకాలు మాత్రమే చేరవేత
- అదేస్థాయిలో నోటుపుస్తకాలు సైతం
- ఏకరూప దుస్తుల పరిస్థితి అంతంతే..

హన్వాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉచిత పాఠ్యపుస్తకాలు ఇప్పటివరకు 60 శాతం మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మండలంలో మొత్తం 64పాఠశాలలకు గానూ సుమారు 25వేల పైచిలుకు పాఠ్యపుస్తకాలు అవసరం ఉన్నాయి. అదేస్థాయిలో నోటుపుస్తకాలు సైతం కావాల్సి ఉంది. కాగా ఇటీవల ప్రభుత్వం పుస్తకాలను ముందస్తుగా సరఫరా చేశారు. కానీ పూర్తిస్థాయిలో రాలేదు. ఇప్పటివరకు 15వేల పాఠ్యపుస్తకాలు మాత్రమే రావడం గమనార్హం. కాగా మరో 10వేల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. అదేవిధంగా అదేస్థాయిలో నోట్‌పుస్తకాలు సైతం సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. అయితే పాఠశాలలు పున:ప్రారంభమయ్యే నాటికి పూర్తిస్థాయిలో పుస్తకాలు అందుబాటులోకి వస్తాయా? అని అనుమానం నెలకొంది. కాగా విషయంపై అధికారులు మాత్రం పొంతనలేని సమాధానం చెబుతున్నారు. దాదాపు 90శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయని అంటున్నారు. ఏదేమైనా పూర్తిస్థాయిలో పుస్తకాలు పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

90శాతం అందుబాటులో..



పాఠశాలలు ప్రారంభం నాటికి అందరు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలను పంపిణీ చేస్తాం. ఇప్పటి వరకు మొత్తం 90శాతం పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. స్థానిక కేజీబీవీలో వీటిని నిల్వ చేశాం. పాఠశాలలు ప్రారంభమయ్యాక పంపిణీ చేస్తాం. కాగా ఏకరూప దుస్తుల బాధ్యతను ప్రభుత్వం ఎంఎంఎస్‌కు అప్పగించింది. ఇందుకు సంబంధించిన వస్త్రం కూడా పంపిణీ చేశారు. అయితే ఎప్పటిలోగా అందజేస్తారనేది వారికే తెలియాలి.

– రాజునాయక్, ఎంఈఓ, హన్వాడ

ఏకరూప దుస్తులదీ అదే పరిస్థితి..

ఇదిలా ఉండగా విద్యార్థులకు అందించాల్సిన ఏకరూప దుస్తులు కూడా సకాలంలో అందే పరిస్థితి కనబడటం లేదు. నిర్వహణను ఎంఎంఎస్‌కు అప్పగించడంతో మండలంలోని వివిధ మహిళా సంఘాల వారు దుస్తులు కుట్టేందుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వం పంపిణీ చేసిన వస్త్రం ఆదివారం స్థానిక కార్యాలయానికి చేరడంతో ఆదేరోజు మహిళా సంఘాలకు అందించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తిస్థాయిలో అందించగలుగుతారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

హన్వాడ: మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు హన్వాడ పోలీసులు సోమవారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ మండలం వెంకటాపూర్‌నకు చెందిన గొల్లహన్మంతు తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. చిన్నదర్పల్లి శివారులో పట్టుకున్నారు. ఈమేరకు ట్రాక్టర్‌ను హన్వాడ ఠాణాకు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

యారోనిపల్లిలో...

యారోనిపల్లిలో వడ్డె వెంకటేష్ తన ట్రాక్టర్‌లో అటవీ ప్రాంతం గుండా ఫిల్టర్ ఇసుక తయారీకి మట్టిని తరలిస్తూ సోమవారం అటవీశాఖ అధికారులకు చిక్కాడు. విషయంపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో.. రెండు మూడు రోజులుగా పోలీసులు నిఘా పెట్టగా వెంకటేష్ ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తూ పట్టుబడ్డాడు. అంతకుముందు ఆభంగపట్నంనకు చెందిన వడ్డె కుర్మయ్యను, ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి చంద్రయ్య పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవుమృతి

చిన్నచింతకుంట: తిరుమలాపురం సమీపంలోని వ్యవసాయ పొలంలో సోమవారం రైతు భట్టు భోజరాజుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం వీచిన గాలివానకు గ్రామానికి చెందిన నీలమ్మ పొలంలో 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కాగా సోమవారం ఉదయం భోజరాజు అటుగా తన పశువులను మేతకోసం తీసుకెళ్లాడు.. కానీ తెగిపడిన విద్యుత్ వైర్లను గమనించలేదు. ఈ క్రమంలోనే ఓ ఆవు మేత మేస్తూ విద్యుత్‌వైర్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా మరోవారం రోజులు గడిస్తే తన ఆవు ఓ లేగ దూడకు జన్మనిచ్చేదని.. ఇంతలోనే ఇలా జరిగిందని బాధితుడు వాపోయాడు. ఆవు మృతితో తాను ఆధారం కోల్పోవడంతో పాటు.. రూ. 70వేల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఆకస్మికంగా పోలీసుల తనిఖీలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు పరిసరాలో సోమవారం సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్యాంకు వద్ద మార్చు వేసి దొంగతనాలు చేస్తున్న వారిని గుర్తించేందుకు, బ్యాంకు నుంచి ఎక్కువ డబ్బులు విత్ డ్రా చేసుకొని వెళ్తున్నవారు, బ్యాంకు వెలుపల ఉండి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమానం ఉన్న వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు చేసినట్లు సీఐ శివశంకర్ తెలిపారు. బ్యాంకు లోపల సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం బ్యాంకుకు వచ్చిపోయే కస్టమర్లపై నిఘా ఉంచాలని ఎవరిపైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని వారికి సూచించారు.



ఘనంగా సామూహిక హోమాలు

మిడ్జిల్: మండల కేంద్రంలో బొడ్రాయి ఉత్సవాలలో భాగంగా ఈదమ్మ ఆలయం దగ్గర సోమవారం సామూహిక హోమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బొడ్రాయికి జలాభిషేకం చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం కుంకుమార్చన చేపట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయబృందం

కోయిల్‌కొండ: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వపాఠశాలల్లో విద్యబోధన చేస్తున్నట్లు హెచ్‌ఎం గంగ్యానాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని కనాయపల్లిలో బడి ఈడు కలిగిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయబృందంతో కలిసి.. ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు.ప్రభుత్వ పాఠశాలలో ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి వసతులను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పుట్టపల్లి ధర్మారెడ్డి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

కోయిల్‌కొండ: మండలంలోని రామన్నపల్లితండాలో కుష్టు నివారణపై డీపీఎంఓ నర్సింహారెడ్డి, హనుమంతరావు సోమవారం అవగాహన కల్పించారు. గ్రామంలో బాధితులను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాధి నివారణపై ప్రజలకు సూచనలు చేశారు. అదేవిధంగా రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మాజీసర్పంచ్ చక్రవర్తి, వైద్యసిబ్బంది శివశంకర్, బాలమణి, వెంకటేష్, జానకమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పల్లెర్ల హనుమంతరావు, నెహ్రూల సేవలు మరువలేం



నెహ్రూ, పల్లెర్ల హనుమంతురావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన పల్లెర్ల హనుమంతరావు రెవెన్యూశాఖ మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లాలో ఎన్నో విద్యాసంస్థలకు స్థాపన కోసం ఆయన చేసిన కృషిని మరువలేమని కొనియాడారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, సీనియర్ నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు రాములుయాదవ్, ఫహీం, అజ్మత్‌అలీ, నాగరాజు, కిషన్‌నాయక్, షేక్ బాబుమియా, మాధవరెడ్డి, వెంకటలక్ష్మి, అంతయ్య, అక్మర్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

గండీడ్: మండలంలో ఆదివారం గాలివాన బీభత్సానికి పలు చోట్ల స్తంభాలు విరిగి.. విద్యుత్ సరఫరా నిలిచిన నేపథ్యంలో అధికారులు సోమవారం పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాగా సాలార్‌నగర్, పగిడ్యాల్, చిన్నవార్వాల్ , జానంపల్లి , గోవింద్‌పల్లి, పెద్దవార్వాల్ తదితర గ్రామాల్లో గాలివానకు 25 స్తంభాలు విరిగినట్లు తెలిపారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు.. తెగిన విద్యుత్ వైర్లను సరిచేశారు. కొన్నిచోట్ల స్తంభాలపై చెట్లు కూడా విరిగి పడగా వాటన్నింటిని తొలగించేశారు. ఏడీ మద్దిలేటి పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఆర్‌ఐ యాసిన్ సాలార్‌నగర్‌లో పాక్షికంగా కూలిన ఇంటిని పరిశీలించారు. గ్రామాల్లో గాలివాన వల్ల ఇళ్లు కూలినా, పశువులు చనిపోయినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ నాగలక్ష్మి సూచించారు.



పగిడ్యాల్‌లో పనులను పరిశీలిస్తున్న అధికారులు

అకాలవర్షం బాధితులకు ఆదుకోవాలి



చౌటపల్లిలో ఈదురు గాలులకు ధ్వంసమైన ఓ ఇంటి పైకప్పు(ఫైల్)

నవాబుపేట: అకాల వర్షం, ఈదురు గాలులతో రేకుల ఇళ్లు కూలడంతో నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలని ఎంపీటీసీ లక్ష్మీబాయి, మాజీ సర్పంచ్ అబ్దుల్లా, మాజీ ఉప సర్పంచ్ రవికిరణ్‌లు అధికారులను కోరారు. ఆదివారం ఈదురు గాలులతో ఇప్పటూర్‌కు చెందిన బుర్ర సత్యయ్య, నవాబ్, కుమ్మరి పెంటయ్య, సత్యనారాయణరెడ్డిల రేకుల ఇళ్లు కూలిపోయాయని తెలిపారు. అదేవిధంగా చౌటపల్లికి చెందిన ఆంజనేయులు, యాదయ్యగౌడ్‌ల ఇళ్ల పైకప్పులు ఎగిరి పోయాయని.. ఇంట్లో ఉన్న బియ్యం తదితర వస్తువులు నానిపోయాయని వివరించారు. వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటూర్‌లో 20 విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో వాటిని ఏర్పాటు చేసే పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. మంగళవారం నాటికి పూర్తి కావచ్చని వివరించారు.

నీటి ఎద్దడి తీర్చాలని వినతి

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో ఆరునెలల నుంచి తీవ్ర తాగునిటి ఎద్దడి ఉందని వెంటనే నీటి ఎద్దడిని తీర్చాలని కోరుతూ వార్డు మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ సోమవారం మున్సిపల్ కమిషనర్ సునీతకు వినతి పత్రం అందజేశారు. ఆరు నెలలుగా సమస్య ఏర్పండిందని ఈ సందర్భంగా వివరించారు. వెంటనే మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేయించి నీటి ఎద్దడి నివారించేందుకు కృషిచేయాలని ఈ సందర్భంగా కోరారు.



ఆపరేటర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

గండీడ్: విద్యుత్ ఆపరేటర్‌కు తృటిలో ప్రమాదం తప్పిపోయిన ఘటన మండలపరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. కప్లాపూర్‌నకు చెందిన అశోక్‌గౌడ్ వెన్నాచేడ్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఆదివారం డ్యూటీ లేకపోవడంతో గ్రామంలోనే ఉన్నాడు. ఈక్రమంలో సాయంత్రం 8 గంటల ప్రాంతంలో కప్లాపూర్‌లో 33 కేవీ బ్రేక్‌డౌన్ అయ్యిందని పరిశీలించి రిపేరు చేయాలని ఏఈ శ్రీకాంత్ ఆయనకు ఫోన్‌లో సూచించారు. దీంతో అశోక్ లైన్ దగ్గరికి వెళ్లి చూసి.. ఏ సమస్య లేదని ఏఈకి తెలిపాడు. కాగా కొద్దిసేపటికి జానంపల్లి వద్ద మంటలు వస్తున్నాయని చూసి రావాలని ఏఈ సూచించగా.. అక్కడికి వెళ్లిన అశోక్ ఏబీ స్విచ్‌లో మంటలు వస్తున్నట్లు ఏఈకి సమాచారం ఇచ్చాడు. కాగా రిపేర్ చేయాలని ఆయన అశోక్‌కు సూచించారు. దీంతో పని ప్రారంభించగా.. కొద్దిసేపటికే విద్యుత్ సరఫరా ప్రారంభమై అశోక్‌ను విసిరికొట్టేసింది. దీంతో అతడు ఎగిరి కొంతదూరంలో పడ్డాడు. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు కాగా ఎల్‌సీ ఇచ్చి.. తిరిగి తనకు చెప్పకుండా రిటన్ చేయడంతో ప్రమాదం వాటిల్లిందని బాధితుడు వివరించారు. కోస్గి ఆస్పతిలో చికిత్స చేయించుకున్నాడు. బీపీ కూడా పెరిగిందని వాపోయాడు. విషయం ఆపరేటర్ డీఈ, ఏడీల దృష్టికి తీసుకెళ్లాడు. విషయమై ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా తాను ఎల్‌సీ ఇవ్వలేదని ఏబీ స్విచ్ వద్ద పనిచేస్తుంటే 33 కేవీ ఇండక్షన్ వచ్చిందన్నారు. ఆయనకు ఏదైనా చికిత్స అవసరమైతే చేయిస్తామని తెలిపారు.